# మామూలు జీ(వి)తం

ఇంటికి వెళ్ళగానే ఆఫీసు బట్టలు విడిచేసి లుంగీ కట్టుకుని బాత్రూంలో దూరాను, స్నానమే చేద్దామనుకునీ కూడా; మా ఆవిడ చేసిన ఆక్రందనవల్ల మొహం మాత్రం కడుక్కొని తలుపు తెరిచాను. ఎదురుగా, ఓ చేతిలో ప్యాంటు, ఓ చేతిలో షర్టు పట్టుకు నిలబడింది. 'అవి ఆఫీసు గుడ్డలు, పైజమా తీసుకురా' అన్నాను.

'తొడుక్కోమని కాదు. జీతం ఏ జేబులో పెట్టారు?'

'ఔరంగజేబులో' అన్నాను మొహం చిట్లించుకుని, గదిలో కెళ్తూ.

'ఇవాళ జీతాలిస్తారని సంబడంగా వెళ్ళారే ఆఫీసుకి!'

'సంబళం అంటే అరవంలో జీతమే. నీకు అరవం కూడా వచ్చా?' అన్నాను.

'ఇంతకీ జీతం యిచ్చారా లేదా?'

'ఇచ్చారు.'

'మరి పిక్‌పాకెట్ అయిపోయిందా?'

"ఇంచుమించు అలాగే ఐంది. దసరా మామూళ్ళిచ్చేశాను."

"ఏమిటి జీతం అంతానా."

"అంతా అనగా ఎంత! కటింగ్స్ పోను నాలుగు వందలిరవై రూపాయలేగా."

"నాలుగు వందల ఇరవై రూపాయలు దసరా మామూళ్ళా?"

'420 అంటే అర్థం మళ్ళా వేరు. నాకు తిక్కెత్తించకు!' అని వేలు ఆడించాను. 'నా దగ్గర పనిచేసే గ్యాంగ్‌మెన్ ఇరవైమంది మా అసిస్టెంట్ ప్యూన్లు ఇద్దరు, డివిజనల్ ఇంజనీర్ ప్యూన్లు ఇద్దరు, సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్యూన్లు ముగ్గురు, ఆఫీసులో అకౌంట్స్ సెక్షన్, ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్, డిస్పాచ్ సెక్షన్ ప్యూన్లు, ఆఫీస్ స్వీపర్లు ముగ్గురు, వాచ్‌మెన్స్ ఇద్దరు, ఆఫీస్ పోస్ట్‌మెన్, టెలిగ్రాఫ్ మెసెంజర్, ఇంటి అడ్రస్‌వాళ్లు, టెలిఫోన్ తుడిచి సెంటు పూసేవాళ్ళు, టెలిఫోన్ రిపేరింగ్ సర్వీసింగ్ వాళ్ళు, మా కాంట్రాక్టర్ జవాన్లు,

దసరా ఉత్సవాల సందర్భంగా మన వీధి చివర పందిరివేసి రికార్డు డాన్సులూ, హరికథలూ పెట్టే దుర్గాభక్త సమాజం పెద్దలు, వాళ్ళకి పోటీగా వీధికి ఆ చివర ఏ ప్రోగ్రాములూ పెట్టనందుకు భక్తి ప్రోత్సాహ సంఘం పిన్నలు, నా సైకిల్ రిపేరుచేసే షాపుకుర్రాళ్లు, నేను కాఫీతాగే క్యాంటీన్ సర్వరు, క్లీనర్లు, ఏ ఒక్కడూ కూడా ఐదు రూపాయలకి తక్కువ అయితే పుచ్చుకోలేదు. నా పర్సనల్ ప్యూను పాతిక రూపాయలకి తక్కువైతే ఇంతటితో మీకూ నాకూ చెల్లు అన్నాడు. క్యాంటీన్ కొతా ముప్ఫయి రూపాయలు చెల్లు పెట్టాననుకో.'

"అబ్బ ! ఎంతమంది వున్నారండీ మన మేలుకోరే మిత్రులు ! నిజంగా మీరు నా భర్త కావడం నా పురాకృత సుకృతం!" అని, లుంగీ విప్పి పైజమా వేసుకోబోతున్న నన్ను కౌగలించుకుని ముద్దాడింది మా ఆవిడ. (కొంచెం యిబ్బందైంది; ఆవిణ్ణి విడిపించుకోడానికి, అది వేరే కథ)

"మరి ఈ నెల అంతా ఎలా గడుపుతామండీ ?" అంది కౌగిట్లోంచి విడిపోగానే, అతీత శక్తులు హరించిపోయిన గంధర్వ వనిత లాగ.

"వేస్తున్నాగా, దానికి స్కీము" అన్నాను.

*　　　*　　　*

తెల్లవారింది. ఎంచక్కా ఆదివారం సెలవు. మహర్నవమి పండగ. నిన్ననే అందరూ జీతా లందుకున్నారు. మొత్తం పదిమంది చాలు నాకు.

నిన్న సాయంకాలం చూశాను సర్క్యులరు. ఆదివారం ఉదయం మేనేజింగ్ డైరెక్టర్ గారింట్లో అత్యవసర సమావేశం "సెలవురోజు పండగా కాబట్టి ఆఫీసులో కంటె మా బంగళాలో సదుపాయంగా వుంటుందనీ ఈ మీటింగ్‌కి మా బంగళాకి రాడానికి ఎవరికీ అభ్యంతరం వుండదనీ భావిస్తున్నాను" అని చివర వాక్యం కలిపారు ఎం. డి. గారు.

సెక్రటరీగారు, పర్సనల్ ఆఫీసర్‌గారు, వెల్ఫేర్ ఆఫీసర్‌గారు, సూపరింటెండింగ్ ఇంజనీరుగారు, పి. ఎ. గారు, పర్చేజ్ ఆఫీసర్

గారు, కమర్షియల్ మేనేజర్‌గారు, ఛీఫ్ అక్కౌంట్స్ ఆఫీసర్‌గారు, ఆఫీస్ మేనేజర్‌గారు, ఎం. డి. గారు ఇంతమంది వుంటారక్కడ.

'అందర్నీ చూడొచ్చు, నువ్వూ రా' అన్నాను మా ఆవిడతో. వాళ్ళ చెల్లెలి పెళ్ళిలో లభించిన కంచిపట్టు చీర తీసింది.

"నీ మొహంలా వుంది ఆ చీర," అన్నాను.

"ఈ చీరకేమండీ, వొంక పెడతారు ?

"అబ్బా ! చీర బాగులేదన్లేదే బాబూ, నీ మొహం ఆ చీరలా ధగ ధగ లాడుతోందన్నానంతే కిందటి దీపావళికి మీ తోటికోడలు పెట్టిన హాఫ్‌వాయిల్ చీర తియ్యి."

"అది రంగు వెలిసిపోయిందండీ."

"మన బ్రతుకులే వెలిసిపోయాయి ఇప్పుడు పద పద."

* * *

తడుముకోకుండానే ఇచ్చాను వుపన్యాసం. "అయ్యలారా ! మిమ్మల్నందర్నీ ఇక్కడ చూడ్డం చాలా అదృష్టం. ఏమిటంటే మా ఆశ్రితులందరికీ దసరా మామూళ్ళు ఇచ్చేసి, నిన్న జీతంలో ఒక్క రూపాయి మిగలకుండా ఇంటికి వెళ్ళాను. మామూలే అనుకుంటారో గ్రాంటే అనుకుంటారో మీ ఇష్టం. మీరు పదిమందీ మా అధికారులు. వాళ్ళకీ మేం ఎంతో మీరు నాకు అంత. తలా నలభై రూపాయలూ మా మొహాన పడెయ్యండి నా మొహం మీకు అలవాటైపోతే అదుగో, రంగు వెలిసిపోయిన ఆ ఇల్లాలి మొహం చూసి అయినా మామూలు ఇచ్చేసి ఈ మధ్య తరగతి సంసారిని కాపాడండి."

"మేం కూడా దసరా మామూళ్ళు చాలానే ఇచ్చాం" అన్నారు చీఫ్ ఎకౌంట్స్ ఆఫీసర్‌గారు.

"నో, అతని పరిస్థితి మరీ అధ్వాన్నంగా వుంది. అందరూ తలా నలభై యిచ్చెయ్యండి" అని ఎం. డి. గారు పర్స్ తెరిచారు.

అంతే. ఐదు నిమిషాల్లో నేనూ మా ఆవిడా 'మామూలు' మొహాలతో ఇల్లు చేరాం.

(29-9-79)